ఆంధ్రజ్యోతి
7 వరంగల్
ఆదివారం 12 మే 2024

మకర, చంద్రప్రభ వాహనాలపై అమ్మవారు
- మూడో రోజుకు భద్రకాళి బ్రహ్మోత్సవాలు

8



- వరంగల్ లోక్‌సభ సీటుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ గురి
- పోటాపోటీగా ప్రచారం నిర్వహించిన ప్రధానపార్టీలు
- వ్యక్తిగత విమర్శలు, దేశభద్రత, రిజర్వేషన్లు, గాడిద గుడ్డు చుట్టూ సాగిన ప్రచారం
- ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక హామీలు గుప్పించిన అభ్యర్థులు, నేతలు
- ఓటరు దేవుడి కరుణపైనే ఆశలు
- ప్రచారం ముగియడంతో ప్రలోభాలపై దృష్టి





త్రిముఖ పోరు.. గెలిచేదెవరు?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ ఎంపీ స్థానంపై ప్రధాన పార్టీలు గురి పెట్టాయి. బలమైన అభ్యర్థులను బరిలో దించి, హోరా హోరీగా ప్రచారం నిర్వహించాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు ప్రచారంలో దిగారు. పదేళ్లుగా గెలుపునకు దూరంగా ఉన్న కాంగ్రెస్ ఈసారి పక్కాగా ఓరుగల్లు సీటులో పాగా వేయాలని వ్యూహరచన చేస్తోంది. 40 ఏళ్ల క్రితం గెలిచిన వరంగల్‌లో చరిత్ర పునరావృతం చేసి, కాషాయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో బీజేపీ ప్రయత్నాలు చేస్తుండగా, గత మూడు ఎన్నికల్లో వరుసగా గెలిచిన బీఆర్ఎస్ నాలుగోసారి కూడా విజయం సాధించాలనే పట్టుదలతో ప్రచారం నిర్వహించింది. వ్యక్తిగత విమర్శలతో పాటు జాతీయవాదం, రిజర్వేషన్ల రద్దు, గాడిద గుడ్డు చుట్టూ వరంగల్ ఎన్నికల ప్రచారం జరిగింది. శనివారం ప్రచారం ముగియడంతో ప్రలోభాలపై దృష్టి పెట్టిన నేతలు గెలుపు కోసం చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో త్రిముఖ పోరులో గెలుపెవరిదనే ఉత్కంఠ ఓరుగల్లువాసుల్లో నెలకొంది



హోరెత్తిన ప్రచార పర్వం

వరంగల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ గెలుపును సవాల్‌గా తీసుకుని ప్రచారం సాగించాయి. బూత్ స్థాయి సమావేశాలు మొదలు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలతో పాటు, వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించి కేడర్‌ను ఎన్నికల యుద్ధానికి సిద్ధం చేశాయి. మండల కేంద్రాలతో పాటు మేజర్ గ్రామపంచాయతీల్లో కార్నర్ మీటింగులను ఏర్పాటు చేశారు. అభ్యర్థులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి నేతలు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె, వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు అహర్నిషలు కృషి చేశారు. విరామం ఎరగకుండా ప్రచారంతో పాటు వ్యూహ రచనలతో శ్రీహరి క్షణం తీరిక లేకుండా ఎన్నికల్లో నిమగ్నమయ్యారు. బీజేపీలో పలువురు నేతలు సహకారం అందించినప్పటికి అభ్యర్థి అరూరి రమేష్ అన్ని తానై వ్యవహరించారు. ప్రచారంలో విస్తృత పర్యటనలతో పాటు పార్టీలో చేరికలపై ప్రధానంగా ఫోకస్ పెట్టారు. ఇక బీఆర్ఎస్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పెద్దదిక్కుగా వ్యవహరించారు. వర్ధన్నపేట, పాలకుర్తి నియోజకర్గాలపై ప్రధానంగా దృష్టి పెట్టి ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు విస్తృతంగా ప్రచారం సాగించారు. మాజీ సీఎం కేసీఆర్‌తో

మిగతా 10వ పేజీలో..

ఉద్యమకారుడిని ఆదరించండి

- కడియం కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- బీజేపీ అభ్యర్థి అరూరి కబ్జాకోరు
- గ్యారంటీలతో కాంగ్రెస్ మోసం
- మాజీ మంత్రి దయాకర్‌రావు
- పాలకుర్తిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం

9



పాలకుర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, చిత్రంలో అభ్యర్థి సుధీర్‌కుమార్

ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి

- ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి.. 144 సెక్షన్ అమలు
- వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

8

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం

సోదరి పరీక్ష కోసం హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం

ఆలేరు వద్ద కారును ఢీకొట్టిన డీసీఎం



తన్మయి (ఫైల్)

కరీమాబాద్, మే 11: సోదరిని పరీక్ష రాయించేందుకు తల్లితో కలిసి హైదరాబాద్ బయల్దేరిన ఓ బీటెక్ విద్యార్థిని రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో శనివారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించి వివరాలివీ.. వరంగల్ నగర పరిధిలోని కరీమాబాద్ సుభాష్ విగ్రహం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ నాగపూరి కాళీచరణ్-సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు తన్మయి అలియాస్ చెర్రి (22) బొల్లికుంటలోని ఓ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్న కూతురు హర్షిత ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తవగా శనివారం హైదరాబాద్‌లోని ఓ సెంటర్‌లో ఎప్‌సెట్ పరీక్ష రాయాల్సి ఉంది. దీంతో ఆమెను పరీక్ష రాయించేందుకు గాను తల్లి సంధ్య, తన్మయి, హర్షిత కలిసి తమ తెలిసిన వారి కారు తీసుకుని ఓ డ్రైవర్‌ను మాట్లాడుకుని హైదరాబాద్ బయలుదేరారు. ఈ క్రమంలో యాదాద్రి జిల్లా ఆలేరు సమీపంలోని పెట్రోల్ బంకులో నుంచి వచ్చిన ఓ డీసీఎం.. వారు ప్రయాణిస్తున్న కారును ఢీ కొట్టింది. దాంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న తన్మయి తీవ్రంగా గాయపడగా, తల్లి సంధ్య, సోదరి హర్షితకు స్వల్ప గాయాలయ్యాయి. తన్మయిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమయంగా ఉండటంతో హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే తన్మయి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

కరీమాబాద్‌లో విషాదం...

కారు ప్రమాదంలో బీటెక్ చదువుతున్న తన్మయి మృతి చెందడంతో కరీమాబాద్ సుభాష్ విగ్రహం ప్రాంతంలో విషాదం అలుముకుంది. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ తండ్రి కాళీచరణ్ తన ఇద్దరు కూతుర్లను చదివిస్తున్నాడని, మరో రెండేళ్లలో తన్మయి బీటెక్ చదువు పుర్తయి ఏదో ఉద్యోగం చేసుకొని స్థిరపడుతుందని అనుకుంటుండగా ఇంతలో ఇంతటి ఘోరం జరిగిందని కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.



మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

నా విజయం ఖాయమైంది..

- ప్రజల ఆదరణతో ధీమాగా చెబుతున్నా..
- వరంగల్ నగరాభివృద్ధి నా బాధ్యత
- బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు తిరస్కరించారు..
- మీడియా సమావేశంలో వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

9



మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

భారీ మెజారిటీతో గెలుస్తున్నా..

- అన్ని వర్గాల ప్రజల మద్దతు నాకే ఉంది..
- కాంగ్రెస్ డబ్బు, మద్యంతో ఓట్లు కొనాలని చూస్తోంది..
- నాపై వ్యక్తిగత విమర్శలు చేసే వారి చరిత్ర ప్రజలకు తెలుసు
- మోదీ ప్రధానిగా ఉంటేనే దేశ ప్రజలకు రక్షణ
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

8

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, మే 11: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని యార్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ యార్డులో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల లోపు ఉంటుంది. ఎత్తు 5.8, గుండ్రటి ఎరుపైన ముఖం, బ్రౌన్ వైట్అండ్ బ్లాక్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. బ్లాక్ చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

మోదీ పాలనలో దేశం సురక్షితం

వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

మడికొండ, మే 11: నరేంద్ర మోదీ పాలనలోనే దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మడికొండలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో రమేష్ పాల్గొన్నారు. యువతతో కలిసి బైక్ నడుపుతూ కమలం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దేశంలో 50 ఏళ్లు పరిపాలించి దేశానికి ఉపయోగపడే ఒక్కపని చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో కబ్జాలు, స్కాంలు, మతఘర్షణలు, బార్డర్‌లో యుద్ధాలు, దేశంలో బాంబుపేలుళ్లు ఉండేవన్నారు. బీజేపీ పాలనలో సురక్షితంగా, సుభిక్షంగా ఉందన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించి మోదీ ప్రభుత్వంలోకి పంపిస్తే సమస్యలపై నిరంతరం శ్రమిస్తానని అరూరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో

జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, పార్టీ సీనియర్ నాయకులు తౌటిరెడ్డి రవిందర్‌రెడ్డి, నాయకులు ముత్తోజు సురేష్, దువ్వ నవీన్, కందుకూరి బాలరాజు, దార ధనుంజయ్, బొల్లికొండ వినోద్, కొలిపాక కుమార్‌బాబు పాల్గొన్నారు.



మడికొండలో బైక్ ర్యాలీలో పాల్గొన్న అరూరి రమేష్

బీజేపీలో పలువురి చేరిక

ఐనవోలు: లింగమోరిగూడెం మాజీ సర్పంచ్ మారెపెల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నుంచి సుమారు 50మంది బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్, అరూరి విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల మెజారిటీతో గెలుస్తా..

న్యూశాయంపేట, మే11: మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రెండు లక్షల మెజారిటీతో గెలుస్తానని వరంగల్ లోక్‌సభ బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరూరి రమేష్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ వేల కోట్ల రూపాయల డబ్బులు ఇక్కడ పంచి గెలవాలని చూస్తోందని ఆరోపించారు. వాళ్లు ఇచ్చే డబ్బులను ప్రజలు తీసుకుని ఓట్లు బీజేపీకి వేయాలన్నారు. ప్రధాని మోదీని చూసి కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్ 6గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిందని, ఇందులో ఏవీ సరిగా నెరవేర్చలేదన్నారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేసే నాయకుల చరిత్ర ప్రజలకు తెలుసునన్నారు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహం తో పనిచేస్తున్నారన్నారు. పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత మెజారిటీ వస్తుందని చెప్పారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వరంగ ల్ లోక్‌సభ పరిధిలోని ప్రజలందరూ ఉదయం 6గంటల నుంచే పోలింగ్ బూత్‌లకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని ఈ సందర్భంగా అరూరి ప్రజలకు విన్నవించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకులు అరూరి రమేష్‌కు మద్దతు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులు రావు పద్మ, గంటా రవి, వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మురళీధర్‌గౌడ్‌తోపాటు బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మకర, చంద్రప్రభ వాహనాలపై అమ్మవారు

మూడో రోజుకు భద్రకాళి బ్రహ్మోత్సవాలు



అమ్మవారిని వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, మే 11: వరంగల్ నగరంలోని భద్రకాళి దేవస్థానంలో కొనసాగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మకర, చంద్రప్రభ వాహనాలపై ఊరేగించారు. శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన పెరిక కుల సం ఘం అమ్మవారి పూజ ఉభయ సేవా దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు పోటెత్తారు. నేడు (ఆదివారం) శంకర జయంతి సందర్భంగా భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, గ్రేటర్ జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వడ్డే రవీందర్, గౌరవ అధ్యక్షుడు దిడ్డి నరేందర్, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య, ఆధ్యాత్మిక వేత్త రామాయణ సుధానిధి ప్రవచన కర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఐనవోలు, మే 11: మండలంలోని లింగమోరిగూడెం మాజీ సర్పంచ్ మారెపెల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నుంచి సుమారు 50మంది బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దేవస్థానం మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్, అరూరి విశాల్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు

అందరూ సహకరించాలి

- ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి.. 144 సెక్షన్ అమలు
- వరంగల్ లోకసభ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావిణ్య



మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 11: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య కోరారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 98.28శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ద్వారా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ, పట్టణ ప్రాంతాల్లో ఓటుశాతం పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారాలు, సమావేశాలు రద్దు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు, హోటళ్లలో ఉన్న జిల్లాలకు చెందిన వ్యక్తులు ఉంటే స్వస్థలాలకు వెళ్లిపోవాలని సూచించారు. పేపర్లలో ప్రకటన కోసం ముందస్తుగా ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటరు కార్డు లేని వారు ఆధార్, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఏదేని ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డుతో కూడా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేశామని, ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో దివ్యాంగ, మహిళా, మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుండగా, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. 12వ తేదీన సాయంత్రం వరకు వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాటు చేశామన్నారు. 2126 మంది పీవోలు, 2126 మంది ఏపీవోలు, 4243 మంది ఓపీవోలు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను పోలీసు పహారా మధ్య ఏనుమాముల మార్కెట్‌లోని గోడౌన్‌లో భద్రపరుస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీటీఐలకు ఎన్నికల విధులేల?

విధుల్లో లేని ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల కేటాయింపు

ఆందోళనలో రాష్ట్ర వ్యాప్తంగా 2,400 మంది పీటీఐలు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 11: విద్యా సంవత్సరం ముగింపుతో విధుల నుంచి తొలగించిన పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల(పీటీఐ)లకు ఎన్నికల విధులు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,400మంది పీటీఐలు ఉద్యోగులుకాకుండా ఏ హోదాలో విధులకు వెళ్లాలనే ఆందోళనలో పడ్డారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న పీటీఐలను విద్యా సంవత్సరం ఆరంభం నుంచి చివరిరోజు వరకు మాత్రమే కొనసాగిస్తారు. తర్వాత విధుల్లోంచి తొలగిస్తారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీటీఐల కొనసాగింపుపై తగిన నిర్ణయం తీసుకోవాల్సిందిగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి రాష్ట్ర ఎన్నికల అధికారి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఇదే కాక హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది పీటీఐలను ఉద్యోగం ఉంచి తొలగించి వారిని ఎన్నికల విధులకు ఉపయోగించుకోవడంపై వచ్చే న్యాయ సంబంధమైన సమస్యలను వివరిస్తూ స్టేట్, సెంట్రల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు జీమెయిల్ ద్వారా లేఖలో వివరించినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలోని పీటీఐలు వారిని ఉద్యోగంలో కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విద్యాశాఖను కోరుతున్నారు. లేదంటే ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని కోరుతున్నారు.

వార్డెన్ల ఖాళీల వల్లే

అదనపు బాధ్యతలు

- డీటీడీవో ప్రేమకళ

హనుమకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో హనుమకొండ జిల్లాలో మొత్తం 12 హాస్టళ్లు ఉండగా, ఇందుకుగాను ఏడుగురు హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్లు (వార్డెన్లు) మాత్రమే ఉన్నారనీ, అందువల్ల ఉన్నవాళ్లకే అదనపు బాధ్యతలు అప్పగించామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ ఒక ప్రకటనలో తెలిపారు. 'అధ్వాన్నంగా గిరిజన హాస్టళ్లు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆమె వివరణ ఇచ్చారు. ఇక హనుమకొండ జులైవాడలోని గిరిజన బాలికల వసతిగృహంలో గతంలో అదనపు బాధ్యతలు నిర్వహించిన హెచ్‌డబ్ల్యూవో సస్పెండ్ అయి, తిరిగి ఇదే హాస్టల్‌లో పోసింగ్ తెచ్చుకోవడంతో విద్యార్థుల నుంచి వచ్చిన వ్యతిరేకత, పైగా ఆమె ఈ హాస్టల్‌లో పనిచేయనని లిఖిత పూర్వకంగా రాసిచ్చినందువల్ల హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో తాత్కాలికంగా పని చేసేలా తీసుకున్నామన్నారు. జనగామలోని ప్రభుత్వ బాలుర వసతి గృహ వార్డెన్ అక్కడే ఉన్న ప్రభుత్వ పోస్టుమెట్రిక్ బాలుర హాస్టల్ ఇన్‌చార్జిగా వ్యవహరించడం లేదని స్పష్టం చేశారు. హాస్టల్ పర్యవేక్షణ కొరవడలేదని, ముడుపులు చెల్లిస్తే పని అయినట్లేనన్న ఆరోపణలోనూ నిజం లేదన్నారు.

ఆడబిడ్డగా ఆశీర్వదించండి..

● వరంగల్ అభివృద్ధికి కృషి నిరంతర కృషి ● వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య


అభివాదం చేస్తున్న కడియం కావ్య, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

వడ్డెపల్లి, మే 11: ఆడబిడ్డగా తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య వరంగల్ లోక్‌సభ పరిధిలోని పౌర సమాజాన్ని అభ్యర్థించారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని ఎస్వీఎస్ కాలనీ శ్యామలగార్డెన్‌లో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ఆత్మీయ సమ్మేళనం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ.. మరోసారి బీజేపీ కేంద్రంలోకి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను ఎత్తివేయడంతో పాటు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని అన్నారు. వర్ధన్నపేటలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన అరూరి రమేష్ పేదల భూములతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని కడియం కావ్య ఆరోపించారు. వర్ధన్నపేటలో చెల్లని అరూరి రమేష్ వరంగల్ లోక్‌సభలో ఎలా చెల్లుతారని ఆమె ప్రశ్నించారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల రమేష్, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలోజీ భద్రయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు శృంగారపు భాస్కరాచారి, రుద్రోజు మణింద్రనాథ్, కలకోటి శ్రీధర్, సలేంద్ర జక్కన్న, తాటికొండ రమాచారి, సిద్దోజు రాము, నర్సింహాచారితో పాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి

కాజీపేట, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనుంచి పోటీ చేస్తున్న కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత పాలకుల చేతిలో కాజీపేట అన్నిరంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వేయిస్తంభాల గుడి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మవద్దన్నారు. ట్రైసిటీలో భాగమైన కాజీపేటలో ఇప్పటివరకు బస్టాండ్ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కాలేజీలు, వందపడకల ఆస్పత్రి లాంటి నిర్మాణాలు బీఆర్ఎస్ పార్టీ హామీలకే పరిమితం చేసిందన్నారు. కాజీపేటను అభివృద్ధి చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేటలో రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషి చేసి సాధించి తీరుతామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని అయితేనే ఇవి సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా తనకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంస్థ నాయకులు పెద్దఎత్తున హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నా గెలుపు ఖాయం

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

హనుమకొండ సిటీ, మే 11: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో తన గెలుపు ఖాయమైందని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ధీమాగా చెప్పారు. ప్రజల ఆదరణ, కాంగ్రెస్ పట్ల వారిలో నెలకొన్న విశ్వాసంతో గెలుపుపై భరోసాగా ఉన్నట్లు వెల్లడించారు. శనివారం హనుమ కొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌తో కలిసి కావ్య మాట్లాడారు. ఎన్నిక ప్రచారంలో ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. పార్టీ శ్రేణులు కూడా తన గెలుపు కోసం చిత్తశుద్ధితో పని చేశారన్నారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అంటూ కావ్య వెల్లడించారు. నగరాభివృద్ధి విషయంలో ప్రత్యేక విజన్‌తో ఉన్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తీసుకురావడంతో పాటు ఐటీ, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. స్మార్ట్‌సిటీతో నగర రూపురేఖలు మార్చి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా పాదుపడతానని చెప్పారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఓటింగ్‌కు ముందే ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్‌లను తిరస్కరించినట్లు కావ్య చెప్పారు. బీజేపీ ప్రమాదకర వైఖరిని ప్రజలు పసిగట్టారని చెప్పారు. బీఆర్ఎస్ అంతర్గతంగా బీజేపీతో కుదు ర్చుకున్న ఒప్పందాన్ని ప్రజలు గుర్తించినట్లు చెప్పారు. ప్రజలు స్పష్టమైన నిర్ణయంతో ఉన్నా రని రెండు పార్టీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరన్నారు. పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి, వరంగల్ నగరానికి జరిగిన అభివృద్ధి శూన్యమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షు డు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. మతం, కులం పేరుతో బీజేపీ ప్రజలను రెచ్చగొట్టడం తప్ప మరేమీ తెలియదన్నారు. బీజేపీ అప్రజాస్వామిక పాలనకు బీఆర్ఎస్ వంతపాడుతూ ప్రజలను వంచించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి చర్యలను ఆచరణలో పెట్టిందన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకుందామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ ప్రజలకు సూచించారు. మోదీ పాలనలో దేశంలో విధ్వంసం చెలరేగిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రిస్టియన్లు ఇతర మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నాడు బ్రిటీష్ పాలన నుంచి విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటం వలే మోదీ కబంధ హస్తాల నుంచి దేశ విముక్తి కోసం మరో పోరాటాన్ని కాంగ్రెస్ జరుపు తుంద న్నారు. ఈ పోరాటంలో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీకి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. లౌకిక వాదం, రాజ్యాంగ పరిరక్షణ, మత సామరస్యం, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎం.డి. రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడు తూ.. మును పెన్నడూ లేని రీతిలో దేశంలో దళితులు, నిరుపేదలు, క్రిస్టియన్లు, మైనారిటీలపై దాడులు జరిగాయన్నారు. సమావేశంలో బంక సరళా యాదవ్, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, మోజెస్ ఆనంద్, అజీజ్‌ఖాన్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడిని ఆదరించండి..

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
● పాలకుర్తిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం


పాలకుర్తిలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

పాలకుర్తి, మే 11: పేదోడు, ఉద్యమకారుడైన బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన పాలకుర్తిలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ తరుపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను ఓడగొట్టి రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఓటేసే ముందు ఈ విషయం ఆలోచించాలన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళం విప్పాలన్నా.. కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలన్నా.. అది ఒక్క బీఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం నెలనెలా రూ.2500 తీసుకుంటున్న మహిళలు ఆ పార్టీకే ఓటు వేయాలని, మిగతావారు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎర్రబెల్లి పరోక్షంగా ఎద్దేవా చేశారు. 100 రోజులు కాదు.. 200 రోజులైనా ఆ హామీలు అమలు కావని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తే.. కాంగ్రెస్ వచ్చాక కోతలు మొదలయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఆర్థికంగా బాగుపడ్డారని అన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఏడ్పి ప్రజల సానుభూతితో పాలకుర్తిలో గెలిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, అబద్దాల కోరు, మోసగాడని విమర్శించారు. రెండు లక్షలు రుణమాఫీ చేయకుంటే ఆరునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని అన్నారు. అన్ని సర్వేలు బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుస్తున్నట్లు చెబుతున్నాయని అన్నారు. తనకు నామినేటెడ్ పదవి అక్కరలేదని, పాలకుర్తి నుంచే పోటీ చేస్తానని దయాకర్‌రావు స్పష్టం చేశారు.కడియం శ్రీహరికి కేసీఆర్ రాజకీయంగా ఎన్నో అవకాశాలు ఇచ్చారని, ఆయనకు ఎమ్మెల్యే టికెట్, ఆయన కుమార్తె కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చారని దయాకర్‌రావు గుర్తు చేశారు. అయినప్పటికీ అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరిన శ్రీహరికి, ఆయన కుమార్తె కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన తనను ప్రజలు ఎందుకు ఓడించారో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. తనపై ప్రజలకు కోపం లేదని, ఒక్కసారి కొత్త వ్యక్తికి అవకాశం ఇద్దామని అనుకొని ఓటేశారని అన్నారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ బీఆర్ఎస్ నుచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కోట్ల రూపాయలను దోచుకున్నాడని ఆరోపించారు. భూకబ్జాలకు కేరాఫ్ రమేషేనని ఆరోపించారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశానని గుర్తుచేశారు. పార్టీలు మారే సంస్కృతి తనది కాదన్నారు. ఎంపీగా గెలిస్తే ప్రజల పక్షాన పార్లమెంటులో గళం వినిపిస్తానని తెలిపారు. రాష్ట్రం హక్కులను కాపాడేది బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టం చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చూస్తుంటే హైదరాబాద్ తరహాలో ఉందని, దీనికి కారణం కేసీఆర్, దయాకర్‌రావేనని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపిస్తే ఇక్కడ దయాకర్‌రావు గెలిచినట్లేనని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను ఓడించి రేవంత్‌రెడ్డికి కర్రు కాల్చి వాతపెట్టాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, నాయకులు నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, మల్లేషం, శ్రీనివాసరావు, సుందర్‌రామిరెడ్డి, రామోజీ, గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి టచ్‌లో రేవంత్

- ఏదో ఒకరోజు కాంగ్రెస్‌ను ముంచుతాడు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న దయాకర్‌రావు

రాంనగర్, మే 11: ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి టచ్‌లో ఉన్నాడని, ఏదో ఒకరోజు కాంగ్రెస్‌ను ఆయన ముంచుతాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. శనివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. ప్రజలకు మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడని అన్నారు. అనతికాలంలోనే కాంగ్రెస్ మోసాలను గ్రహించిన ప్రజలు.. కేసీఆర్‌ను ఓడించడంపట్ల బాధపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. విభజన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్టు ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని దయాకర్‌రావు పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్‌ను కడియం శ్రీహరి మోసం చేశాడని ఆయన విమర్శించారు. తన కూతురు కోసం బీఆర్ఎస్ బీఫామ్, పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని పార్టీ మారాడని ఆయన ఆరోపించారు. కడియంకు తానే అవకాశాలు కల్పించానని ఆయన తెలిపారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కడం కడియం శ్రీహరి నైజం అన్నారు. ఆయనకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో 30వేలకు పైగా మెజారిటీతో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో నీతి, నిజాయితీకి మోసగాళ్లకు మధ్య పోటీ జరుగుతోందన్నారు. అవకాశాలు కల్పించిన బీఆర్ఎస్‌ను మోసం చేసిన గురుశిష్యులైన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌లు ఒక ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్, బీజేపీ నుంచి పోటీచేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ ఇద్దరినీ నామరూపాల్లేకుండా ఓడించాలనే కసితో ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కడియం శ్రీహరి అవినీతికి, అణచివేతకు బ్రాండ్ అని, బీఆర్ఎస్ నుంచి భారీగా మూటలు తీసుకుని మోసం చేశాడని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బడామియా మోదీ, రాష్ట్రంలోని చోటామియా రేవంత్ చేతులు కలిపారని ఆయన దుయ్యపట్టారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వరంగల్‌లో విజయం సాధించేది బీఆర్ఎస్ అని వినయభాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తన గెలుపు ఖాయమైందన్నారు.ప్రచారంలో తనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో నేతలు మర్రి యాదవరెడ్డి, వాసుదేవరెడ్డి, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, నార్లగిరి రమేశ్ పాల్గొన్నారు.





కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

గణేష్ ఎకోటెక్ కంపెనీ కార్మికుల ఆందోళన

గీసుగొండ, మే 11: గణేష్ ఎకోటెక్ కంపెనీ ఎదుట అందులో పనిచేసే కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. కార్మికులకు నెలకు రూ.16 వేలు అని చెప్పి రూ.10వేల ఇస్తున్నారని వారు వాపోయారు. పీఎఫ్, ఈఎస్ఐ గురించి అడిగినా యాజమాన్యం పట్టించుకోవటం లేదన్నారు. వీటి గురించి నిలదీసే కార్మికులను కక్షగట్టి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకు ఆంధోళన చేపడుతామని వారు హెచ్చరించారు. కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

సమయం ముగియడంతో..

ప్రచారాన్ని అడ్డుకున్న పోలీసులు



బీజేపీ జెండాలను తీసేస్తున్న పోలీసులు

మిల్స్‌కాలనీ, మే 11: ఎన్నికల ప్రచారానికి సమయం ముగుస్తుండటంతో మిల్స్ కాలనీ పోలీసులు బీజేపీ నిర్వహిస్తున్న ర్యాలీని అడ్డుకొని జెండాలను తీసుకొని కార్యకర్తలను అక్కడ నుంచి ర్యాలీ చేయకుండా పంపించేశారు. శనివారం రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయం సమీపంలో బీజేపీ జెండాలను ద్విచక్రవాహనాలకు కట్టుకొని ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ప్రచారానికి సమయం ముగుస్తున్నందున జెండాలు తీసివేసి ప్రచారాన్ని నిలిపివేయాలని కార్యకర్తలకు సూచించారు. వాహనాలకున్న జెండాలను తొలగించి కార్యకర్తలను ర్యాలీగా వెళ్లకుండా నిలువరించి అక్కడ నుంచి పంపించేశారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ఖిలావరంగల్, మే 11: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ కార్యదర్శి, డివిజన్ ఇన్‌చార్జి మీసాల ప్రకాశ్ అన్నారు. శనివారం ఖిలావరంగల్ 38వ, డివిజన్‌లో కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జనార్ధన్, పోశాల సారంగపాణి, సాగర్ల శ్రీనివాస్, గజ్జెల శ్యామ్, ఎమ్డీ అశ్రఫ్, బైరబోయిన రవిందర్, పోశాల సురేష్, జారతి పద్మ, పుప్పాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభల రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు జిల్లా ఆర్యవైశ్యమహాసభ వరంగల్ అధ్యక్షుడు మునుగోటి రమేష్ మద్దతు ప్రకటించారు. శనివారం హనుమకొండలోని ఆమే నివాసంలో కావ్యను సన్మానించారు.

● శంభునిపేట :కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్నీ వర్గాల ప్రజలకు ప్రాధాన్యతనిస్తుందని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, ఎన్నికల ఇన్‌చార్జి ఎలుగం లీలావతిలు అన్నారు. కావ్యకు మద్దతుగా నాగేంద్రనగర్ నుంచి శంభునిపేట వరకు శనివారం రోడ్ షో నిర్వహించారు. 42వ డివిజన్‌లో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, కార్పొరేటర్ గుండు చందన ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

● గిర్మాజీపేట: కావ్యకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఓటర్లను కోరారు. ఎల్‌వీఆర్ నగర్ కాలనీ, శ్రీకృష్ణకాలనీ, గిర్మాజీపేట, గోవిందరాజుల గుట్ట, రామ్ కీ విల్లాస్, దయానంద్ కాలనీ, అబ్బనికుంట, యాకుత్‌పురా తదితర ప్రాంతాలలో టీపీసీసీ కార్యదర్శి పాదయాత్ర చేపట్టారు.

● మట్టెవాడ :కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి మాజీ మేయర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం బట్టల బజార్, పాపయ్యపేట చమన్, పిన్నావారి వీధి, ఎల్లం బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రజినీకాంత్, మబ్బు ప్రవీణ్, పాలారపు కృష్ణమూర్తి, చాంద్‌పాషా పాల్గొన్నారు.



వరంగల్ బట్టల బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న, గుండా ప్రకాశ్‌రావు

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

మట్టెవాడ, మే 11 : కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌లు ఇద్దరూ ద్రోహులేనని, జన గళాన్ని వినిపించి ఉద్యమ కారుడు బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌లు కోరారు. శనివారం శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు ఏం ఇస్తున్నారో నిర్దిష్ట హామీ ఇవ్వకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 13 హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కేవలం ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలు చేసిందన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి వరంగల్ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ- కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించి అబాసుపాలైందన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనం, 24 అంతస్థుల ఆసుపత్రి భవనం, వరంగల్ బస్టాండ్‌ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డిప్యూటి మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, బీఆర్ఎస్ నాయకులు మెట్టు శ్రీనివాస్, డాక్టర్ హరిరమాదేవి, సయ్యద్ మసూద్, దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, టి రమేష్‌బాబు, బోగి సురేష్, అచ్చ విద్యాసాగర్, క్యాతం రంజిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

బీజేపీ విస్తృత ప్రచారం



శివనగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న గంట రవికు మార్

● ఖిలావరంగల్, మే 11 : ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. శనివారం శివగనర్‌లో డివిజన్ అధ్యక్షుడు రఫీ అధ్యక్షతన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బైరి శ్యామ్‌సుందర్, చింతల అనిల్, ఓబీసీ డివిజన్ అధ్యక్షుడు బొడకుంట్ల శివ, శక్తి కేంద్రం ఇంచార్జిలు కంద ఎకూరి విజయ్‌కుమార్, గంట వేణు తదితరులు పాల్గొన్నారు.

●మట్టెవాడ: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పననవీన్ అన్నారు. డివిజన్ అధ్యక్షుడు రామిడి సుమన్ ఆధ్వర్యంలో శనివారం పిన్నావారి వీధి, ఆర్ఎన్‌టీ రోడ్, స్టేషన్‌రోడ్, జేపీఎన్‌రోడ్, ఎస్‌వీఎన్ రోడ్ మార్గాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

●శంభునిపేట : బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. 41వ డివిజన్‌లో శనివారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దూడ పరమేశ్వర్, తాళ్లపల్లి అర్జున్, రాగి శ్రీకాంత్, శ్రీరామోజు మోహనాచారి, దారబోయిన అనిల్‌పాల్గొన్నారు.

● సంగెం: మూడోసారి మోదీని ప్రధానమంత్రి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పూర్ణచందర్ రెడ్డి అన్నారు. గవిచర్లలో ఆయన ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి కూలీలను కలిసి బీజేపీకి ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, కూన కర్ణాకర్, కీసర వీరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెంకటరమణ



మిల్స్‌కాలనీ, మే 11: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వరంగల్ నగరానికి చెందిన ఆ పార్టీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర చీఫ్ జి.కిషన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత ఎదుగుదలలో క్రియాశీలంగా పనిచేస్తున్న వెంకటరమణను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

గీసుగొండ, మే 11: మండలంలోని సూర్యతండా వద్ద బస్‌స్టేజ్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న 1.8 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు. గంజాయిని సీజ్ చేసి అక్రమంగా తరలిస్తున్న కొత్తవాడకు చెందిన చుక్క సిద్దు, కాశిబుగ్గకు చెందిన అందె నరేష్, కోటిలింగాల గుడి వద్ద గల వడ్డేపల్లి శ్రీనాథ్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎస్ఐ జానీభాష సూర్యతండా వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించి నిలదీయగా ఈ విషయం బయటపడిందని సీఐ తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



సంగెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సంగెం, మే 11: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ చెప్పారు. శనివారం మొండ్రాయిలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంగెం ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

● గీసుగొండ: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మొగిలిచర్ల, ధర్మారంలో శనివారం బీఎస్ఎఫ్ బలగాలు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జానీపాష, వెంకన్న, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ



అధికారులకు సూచనలు ఇస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 11: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి అందజేసేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రాజనాల శ్రీహరి

వరంగల్‌సిటీ, మే 11: వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజనాల శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం హనుమకొండలోని మంత్రి సురేఖ నివాసానికి చేరుకున్న శ్రీహరికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ హయాంలో శాప్ డైరెక్టర్‌గా శ్రీహరి కొనసాగారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో ఉంటూనే అప్పటి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు వ్యతిరేకంగా పార్టీ కార్యక్రమాలు చేశారు. పలుమార్లు బహిరంగంగా ఆరోపణలు చేశారు. అంతేకాదు అప్పటి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటనలో ఆయనను కలిసి ఎమ్మెల్యే నరేందర్‌పై ఫిర్యాదు సైతం చేశారు. ఆయనకు టికెట్ కేటాయించవద్దని, ఆయనకు టికెట్ కేటాయిస్తే మేమంతా బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తామని పార్టీ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తూర్పు నియోజకవర్గంలో తలపెట్టిన సభలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నా ఎమ్మెల్యే టికెట్ నరేందర్‌కే ఇస్తున్నట్లు ప్రకటించక పోవడంతో శ్రీహరి హెచ్చరికే కారణమని పలువురు చర్చించుకున్నారు. ఆ తర్వాత నరేందర్‌కు టికెట్ ఇవ్వడంతో శ్రీహరి బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. అయితే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు మరుసటి రోజు ఉదయమే కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం కొసమెరుపు.

● గీసుగొండ: ఊకల్‌హవేలిలో పలు పార్టీలకు చెందిన 40 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కొత్తగట్టు కోటి, తియ్యారపు నర్సింగం, లచ్చయ్య, వెంకటేశ్వర్లు, కొమురయ్య, శంకర్, రాములు, నర్సయ్య, కుమారస్వామి, యాకయ్య, రమేష్, యదగిరి, పోషాలు, స్వప్న, యశోద, విజయ,కవిత, నాగరాణి, భవాని,స్వేత లతోపాటు 200 మందికి వైస్ఎంపీపీ రడం శ్రావ్యభరత్ కండువాలను కప్పి ఆహ్వానించారు.

● సంగెం: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం కాంగ్రెస్‌లో చేరిన వారికి రేవూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 17వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో డివిజన్‌లోని బొల్లికుంట బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కాంగ్రెస్‌లో చేరారు. బొల్లికుంటకు చెందిన పెరుమాండ్ల ఎల్లగౌడ్, అనుముల భాస్కర్‌రెడ్డి, దొంతి వెంకట్‌రెడ్డి, రేకుల రాజిరెడ్డి, సూర్యకుమారస్వామి, బొజ్జం సదానందం కాంగ్రెస్‌లో చేరారు.



రాజనాల శ్రీహరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్లు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఖిలావరంగల్ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ కేడల పద్మ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని రాంనగర్‌లో డైరెక్టర్లు బండి బాబురావు, తోటకూరి నర్సయ్య, జూలూరి శ్రవణ్‌కుమార్, బిళ్ళ హరీందర్‌లు కాంగ్రెస్‌లో చేరారు.

'కాంగ్రెస్ పార్టీకే మాదిగల మద్దతు'

ఖిలావరంగల్, మే 11: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాట ఇచ్చి తప్పిన బీజేపీకి మాదిగలు తగిన గుణపాఠం చెప్పాలని, అందుకే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల శైమెంటు అన్నారు. శనివారం క్రిస్టియన్‌కాలనీలో వరంగల్ తూర్పు ఇంచార్జి వక్కల కుమార్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్రోళ్ళ సుదర్శన్, బొట్ల రమేష్, కొంగర స్వామి, ఆంజనేయులు, యాకయ్య, ఆనందం, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపాలి



ఉపాధి కూలీలను ఓటేయ్యమని అడుగుతున్న ఇస్మాయిల్

సంగెం, మే 11 : ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్ అన్నారు. గవిచర్లలో ఉపాధి హామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోనె రామచందర్, రౌతు శ్రీనివాస్, ఈర్ల బుచ్చయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

కట్టయ్య సేవలు మరువలేనివి

కరీమాబాద్, మే11: అంబేద్కర్ వాది, దివంగత బొమ్మల్ల కట్టయ్య 3వ వర్ధంతిని శనివారం కరీమాబాద్‌లో అంబేద్కర్ భవన్‌వద్ద నిర్వహించారు. కట్టయ్య కుటుంబ సభ్యులు డీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్ధంతి కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై కట్టయ్య సేవలను కొనియాడారు.

శాసనమండలి చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, బస్వరాజ్ సారయ్య, బీజేపీ నాయకులు గంటా రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ నాయకురాలు డాక్టర్ హరిరమాదేవి, పల్లం రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్టయ్య వరంగల్ అంబేద్కర్ కట్టయ్యగా పేరుగాంచారని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అంబేద్కర్ సిద్ధాంతాలను, బుద్ధుని బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎంతో శ్రమించారన్నారు. కార్యక్రమంలో కట్ట య్య కుటుంబ సభ్యులు కుమారుడు అంబేద్కర్, రాజమణి, సుజాత, శంకర్, గౌతం, నిశాంత్, సిదార్థ, రవితేజ, రాహుల్, అంబేద్కర్ భవన్ కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేశం, ఎర్రగడ్డ వీరస్వామి, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు రౌతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్, కాలేజీల్లో

ప్రవేశాలకు దరఖాస్తులు

సంగెం, మే 11 : గవిచర్లలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సరం చదవడానికి 25 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీలలో ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉన్నట్లు ఆయన వివరించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు

గీసుగొండ, మే 11: ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని హైదరాబాద్ మహేంద్ర యూనివర్సిటీ లా, బీ టెక్ విద్యార్థులు 60 మంది శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి బృందానికి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలు, ఇంటింటికి మరుగుదొడ్లు, నల్లానీటి సరఫరా వంటి అంశాలను జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో అశ్వద్‌కుమార్, నవ్యాస్, ప్రగతి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శంభునిపేట, మే 11 :నగరంలోని శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న మహిళల ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని హనుమాన్ సేవా సమితి (హెచ్ఎస్ఎస్) బాధ్యులు కోరారు. శిబిరం వివరాలతో కూడిన వాల్ పోస్టర్‌ను శనివారం హెచ్ఎస్ఎస్ బాధ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఎస్ మహిళా విభాగం బాధ్యులు బండారి శ్రీకళ, కొలిపాక సంధ్య, దేవులపల్లి శ్రీలత, కూచన దేవలత పాల్గొన్నారు.

వాటర్ ఫ్రిజ్ బహూకరణ

శంభునిపేట, మే 11 : రంగశాయిపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలకు రిషినంద్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ కొల్లూరి యోగానంద్ రూ.45 వేల విలువ గల వాటర్ ఫ్రిజ్‌ను బహూకరించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రిజ్‌ను అందించి కొల్లూరి యోగానంద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ విద్యారాణి, ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

రూ.4 లక్షల నగదు పట్టివేత

వర్ధన్నపేట రూరల్, మే 11 : ఎలాంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.4 లక్షల నగదును శనివారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని డీసీ తండాలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద పోలీసుల వాహనాల తనిఖీల్లో ఈ నగదు పట్టుబ డింది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన పండ్ల వ్యాపారి మామిడాల జయరాం తన కారులో రూ.4 లక్షల నగదును తీసుకుని మరిపెడ బంగ్లా నుంచి హన్మకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై తనిఖీలుచేయగా ఆ నగదును, కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలుంటా యని స్పష్టంచేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, మే 11 : మండలంలోని గురిజాల గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గోలి రవీందర్ రూ.15వేల విలువచేసే 6క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి, రవీందర్ ఇంట్లో నిల్వ చేసిన 12బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

త్రిముఖ పోరు.. గెలిచేదెవరు?

(7వ పేజీ తరువాయి)

పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఇక ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కులం, మతంపైనే, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కబ్జాలపైన ప్రచారం జరిగింది. బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు అంటూ కాంగ్రెస్ ప్రచారం చేయగా, కాంగ్రెస్ హయంలో రాజ్యంగాన్ని సవరించారని, ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని బీజేపీ కౌంటర్ ప్రచారం చేసింది. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి మూడు పర్యాయాలు వరంగల్ లోక్‌సభ పరిధి లోని మడికొండ, రేగొండ, హనుమకొండ చౌరస్తా, పోచమ్మమైదాన్ సెంటర్‌లో సీఎం ప్రచారం చేశారు. 'తెలంగాణకు బీజేపీ ఏం చేసింది.. గాడిద గుడ్డు' అంటూ గాడిద గుడ్డు నమూనాలతో ప్రచారం నిర్వహించారు. మొత్తానికి రెండు వారాలుగా రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల ప్రచారంతో ఓరుగల్లు హోరెత్తింది.

పార్టీలకు సవాల్‌గా వరంగల్ సీటు...

అన్ని రాజకీయ పార్టీలకు వరంగల్ లోక్‌సభభ సీటు ప్రతిష్టాత్మకంగా మారింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వరంగల్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. 2009లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కకుండా పోయింది. ఈ నేపథ్యంలో గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతోపాటు తన కమార్తెనే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నిలిపారు. దీంతో మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే కావడంతో వరంగల్‌లో గెలుపు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. అభ్యర్థి విషయంలో తొలుత కాంగ్రెస్‌లో అసమ్మతి ఉన్నప్పటికి క్రమేణ అన్ని మరిచిపోయి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో కాంగ్రెస్‌కు విజయంపై ధీమాతో ఉంది. అలాగే బీజేపీలోనూ విజయంపై ధీమా వ్యక్తమవుతోంది.

40ఏళ్ల క్రితం 1984లో బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి వరంగల్ నుంచి విజ యం సాధించారు. చరిత్రను పునరావృతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ పావులు కదుపుతోంది. బలమైన అభ్యర్థిని బరిలో దించి ప్రత్యర్థులకు సవాల్ విసురు తోంది. దీంతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలహీనతలను క్యాష్ చేసుకుని వరంగల్ సీటులో పాగా వేయాలని అరూరి రమేష్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ సైతం వరంగల్‌లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో గులాబీ దండు పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని, అదే తమ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు గెలుపునిస్తుందని బీఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్‌స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,25,210	1,28,898	02	295
పాలకుర్తి	1,26,411	1,29,090	13	296
పరకాల	1,08,076	1,14,305	02	239
వరంగల్ పశ్చిమ	1,39,322	1,44,108	16	244
వరంగల్ తూర్పు	1,25,638	1,32,518	339	230
వర్ధన్నపేట	1,34,257	1,39,491	18	279
భూపాలపల్లి	1,36,507	1,40,238	07	317
మొత్తం	8,95,421	9,28,648	397	1,900

ఓటరునాడి మారేనా..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీగా తలపడగా, బీజేపీ కేవలం వరంగల్ తూర్పులోనే రెండోస్థానంతో సరి పెట్టుకుంది. ఆరు ఎమ్మెల్యే స్థానాల్లో కాంగ్రెస్ గెలవగా.. బీఆర్ఎస్ ఒక చోట విజయం సాధించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కీలకమైన నేతలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరు కూడా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చి పోటీ చేస్తున్న నేతలే. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీల ఎజెండా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే బీజేపీ గణనీయంగా బలపడినట్టు ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో గట్టి పోటీ ఇచ్చే స్థాయికి బీజేపీ ఎదగటం చర్చనీయాంశంగా మారింది.

పట్టణ ప్రాంత ఓటర్లపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. దీనికి తోడు ఎంఆర్ పీఎస్ నుంచి కూడా పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభివృద్ధి నినాదం, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఫెయిల్ అంటూ బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేసింది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో ముఖాముఖి పోటీ ఉంటే, పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ మారిందనే చర్చ జరుగు తోంది. ఓటరు నాడి కూడా జాతీయ రాజకీయాలు, జాతీయ అంశాలకే ప్రాధాన్యమిస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో వరంగల్‌లో త్రిముఖ పోరులో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది.

ప్రలోభాలు షురూ..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నక్సల్స్ ప్రాబల్య ప్రాంతమైన భూపాలపల్లిలో సాయంత్రం 4గంటలకే ప్రచారం ముగియగా, మిగతా ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సాయంత్రం 6గంటల వరకు ప్రచారం నిర్వహించారు. చివరి రోజు అభ్యర్థులతో పాటు పార్టీలో కీలక నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో విస్తృంతగా ప్రచారం చేశారు. ఎక్కువగా బైక్ ర్యాలీలలో అభ్యర్థులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రచారం ముగిసిన వెంటనే ఓటరు ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తాయిలాల పంపిణీ అన్ని పార్టీలు షురువు చేశాయి. రెండు ప్రధాన పార్టీలు ఓటుకు రూ.200ల చొప్పున పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంది. మరో పార్టీ కూడా దాదాపు ఇంతే ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మూడోపార్టీ కూడా డబ్బులు పంపిణీపై మల్లాగుల్లాలు పడుతుండగా.. అధిష్ఠానం ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల్లో సుమారు రూ.150కోట్లకు పైగా తాయిలాలు ఓటర్లకు చేరే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎంత నిఘా పెట్టిన పంపిణీ మాత్రం ఆగడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు

పురుషులు: 8,95,421, మహిళలు: 9,28,648, ఇతరులు: 397 , మొత్తం ఓటర్లు: 18,24,466

2009 నుంచి 2023 అసెంబీ ఎన్నికల్లో పోలైన ఓట్లు

లోక్‌సభస్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016(ఉపఎన్నిక)	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ఖానాపురం, మే 11: మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పెరుమాండ్ల సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40సీట్లు, బైపీసీలో 40సీట్లు, సీఈసీలో 40సీట్లు, ఎంఈసీలో 40సీట్లు ఉన్నట్లు తెలిపారు, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆంగ్లమాధ్యంలో విద్యాబోధనతో పాటు విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు, ఉచితం యూనిఫామ్, ఫ్రీ ఆర్టీసీ బస్సు సౌకర్యం, 100మంది విద్యార్థినీలకు (బాలికలకు) ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పర్వతగిరిలో మాట్లాడుతున్న కావ్య

ప్రజలకు సేవచేయడానికే వచ్చా

పార్లమెంటులో గళమెత్తుతా

వరంగల్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య

పర్వతగిరి, మే 11 : ప్రజలకు సేవ చేయడానికే వైద్య వృత్తిని వదిలి రాజకీయాల్లోకి వచ్చాన ని, మీ ప్రతినిధిగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో గళమెత్తుతానని డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత గ్రామానికి కడియం శ్రీహరి ఎంతగానో సేవ చేశారని, ఆయన కూతురిగా అంతకన్నా ఎక్కువ సేవ చేయడానికి గాను పర్వతగిరి మండలాన్ని దత్తత తీసుకుంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అతి తక్కువ సమయంలోనే ఐదు గ్యారెంటీలను అమలుచేసి చూపించిందని, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి కోట్ల అప్పులు చేసిందని, కేంద్రంలో బీజేపీ సైతం దేశాన్ని అప్పులపాలు చేసిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతీ మహిళా ఖాతాలో రూ.లక్ష జమ, వంద రోజుల ఉపాధిహామీ పనులను 200 రోజులకు పెంచుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ భూ బకాసురుడని, ఎక్కడ భూమి కనిపించినా కబ్జాచేస్తాడన్నారు. ఇప్పటికే మండలానికొక గెస్ట్‌హౌజ్ నిర్మించుకున్నాడని, అరూరికి మళ్లీ ఓటేస్తే గ్రామానికొక గెస్ట్‌హౌజ్ కట్టుకుంటాడని అన్నారు. తన సొంత మండలం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కడియం ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పలు గ్రామాల్లో సేవలు చేస్తున్న కడియం కావ్యను ఎంపీగా పార్లమెంటుకు పంపిస్తే మన హక్కులు, మనకు రావాల్సిన నిధుల గురించి కొట్లాడి తెచ్చి అభివృద్ధి చేస్తుందన్నారు. మే 13వ తేదీన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, సరోజన, నాయకులు చలపతిరావు, గంగాధర్‌రావు, సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

దక్షిణాదికి ప్రధాని మోదీ అన్యాయం చేశారు

దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవి పార్లమెంట్ ఎన్నికలు

వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని పార్లమెంటరీ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైపోయిందని, మరికొన్నింటిలో మాత్రమే పోటీ ఉందని, అదికూడా బీజేపీతోనేని బీఆర్ఎస్ ఎక్కడా తమకు పోటీ కాదని స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారతదేశానికి వ్యత్యాసం చూపుతూ దక్షిణాదికి తీరని అన్యాయం చేశారని చెప్పారు. దక్షిణ భారత్‌లో బీజేపీ పెద్దగా లేకపోవడంతో, ఉత్తర భారతంలో పార్టీ ఎంపీలుండడం చేతనో కాని దక్షిణాదికి నిధుల పంపిణీలో సమతూకం పాటించలేదని ఆరోపించారు. దేశ భవిష్యత్ నిర్ణయించేవి పార్లమెంట్ ఎన్నికలని, రాష్ట్రంలో అత్యధికంగా కాంగ్రెస్ ఎంపీలను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు గా నిలవాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిన బీజేపీని ప్రజలు విశ్వసించరని, నిరంకుశ పాలనను ఎదిరించిన, పోరాట పటిమ కలిగిన తెలంగాణను అవహేళన చేసుకుంటూ మాట్లాడుతున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే హిందువుల పుస్తెలు ముస్లింలకు ఇస్తారని ప్రధాని మోదీ తనస్థాయిని దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రం లో కాంగ్రెస్ సర్కార్ మూడు నెలల్లో కూలిపోతుందని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వం ఎలా కూలిపోతుందని నిలదీశారు. అనేక రాష్ట్రాల్లో ప్రతి పక్షపార్టీల ప్రభుత్వా లను బీజేపీ కూల్చిందని అది తెలంగాణలో సాధ్యం కాదన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వాన్ని కదిలించడం బీఆర్ఎస్, బీజేపీ తరం కాదన్నారు.

బీఆర్ఎస్‌కు ఒక్క సీటుకూడా కష్టమే.!

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెల వడం కష్టమేనని తుమ్మల నాగేశ్వర్‌రావు జోస్యం చెప్పారు. నిన్నటి వరకు ఒకటి, రెండు సీట్లలో వారికి ఆశలుండేవని ఇప్పుడు అవి కూడాపోయా యన్నారు. అసత్య ప్రచారాలతో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చేపపిల్లలు, గొర్రెల పథకంలో అవినీతి జరిగిందని,



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

వ్యవస్థలన్నిటిని బీఆర్ఎస్ విచ్ఛిన్నం చేసిందని మండిపడ్డారు. బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ తాపత్రయం పడుతోందని విమర్శించారు. ఉమ్మ డి మహబూబ్‌నగర్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్ లాంటిపార్లమెంటరీ నియోజకవర్గాల్లో తమకు ఏ పార్టీతో పోటీలేదన్నారు. ఇప్పటికే గెలుపు ఖాయమైందని, కొన్నింటిలో బీజేపీతో నేనని, బీఆర్ఎస్ తమకు ఎక్కడా పోటీ కాదన్నారు.

దేశంలోనే ఆదర్శవంతంగా తెలంగాణ సర్కార్..

తెలంగాణలో ఐదు గ్యారంటీలను అమలు చేసి, ప్రజలకు మేలుచేసే విధంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోం దని తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రంలో 7 వేల పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొను గోలు చేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం అప్పులు చేసి పోతే సీఎం రేవంత్‌రెడ్డి వాటికి వడ్డీలు కడుతూ నూతనంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. 69 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్ల రైతుబంధును అన్నదాతల ఖాతా ల్లో వేశామని పేర్కొన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవబోతుందన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సంక్షేమం

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తున్నారని. వారి మేలును ఎన్నటికి మరువని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. తనను మరోసారి ఆశీర్వందించి గెలిపించాలని విజ్ఞప్తి చేశా రు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, సాదు రమేష్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, కోడి శ్రీను పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ తేకపోతే రాళ్లతో కొట్టండి : బలరాంనాయక్

గార్ల మండల కేంద్రంలో రోడ్‌షో

గార్ల : కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పడిన తర్వాత.. తెలంగాణ విభ జన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమను నేలకొల్పక పోతే.. తనను రాళ్లతో కొట్టినా బాధపడనని మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంలో శని వారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనయ్యతో కలిసి మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని సత్యనారాయణపురం క్రాస్‌రోడ్ నుంచి గుంపెళ్లగూడెం, ముల్కనూరు, దుబ్బగూడెం, గార్ల పట్టణంలోని పలు విధుల్లో రోడ్ షో నిర్వ హించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మళ్లీ గార్ల, బయ్యారం ప్రాంతంలో ఓట్లు అడగడానికిరానని స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లుగా అభివృద్ధికి అమడ దూరంలో పెట్టిన ఘనత మోదీ సర్కారుకే దక్కిందన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాద శక్తు లను పెంచి పోషిస్తూ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బట్టు నాగరాజు, జడ్పీటీసీ జాటోత్ జాన్సీలక్ష్మి, పీఏసీ ఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, సొసైటీ డైరెక్టర్ శెట్టి ప్రవీణ్‌కుమార్ నాయుడు, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకటలాల్‌నాయక్ పాల్గొన్నారు.



గార్లలో రోడ్‌షోలో ప్రసంగిస్తున్న పోరిక బలరాంనాయక్

రూ.4లక్షలు పట్టివేత

వర్ధన్నపేట రూరల్, మే 11 : ఎలాంటి పత్రాలు లేకుం డా కారులో తరలిస్తున్న రూ.4 లక్షల నగదును శనివారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని డీసీ తండాలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్ద పోలీసుల వాహనాల తనిఖీల్లో ఈ నగదు పట్టుబ డింది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన పండ్ల వ్యాపారి మామిడాల జయరాం తన కారులో రూ.4 లక్షల నగదును తీసుకుని మరిపెడ బంగ్లా నుంచి హన్మకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై తనిఖీలుచేయగా ఆ నగదును, కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటా యని స్పష్టంచేశారు.

'మంద కృష్ణమాదిగను నిలదీయాలి'

నర్సంపేట టౌన్, మే 11: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాకుతో మతోన్మాది మోదీతో చేతులు కలిపిన మంద కృష్ణమాదిగను నిలదీయాలని దళిత బహుజన పోరాట సమితి (డీబీఎస్) రాష్ట్ర కన్వీనర్ దూడల సాంబయ్య అన్నారు. శనివారం పట్టణంలోని మునిసిపాలిటీ కార్యా లయ ఆవ రణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మనువాద, మతోన్మాద బీజేపీని ఓడించాలని, ప్రమాదంలో ఉన్న భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వా మ్యాన్ని, సెక్యులరిజాన్ని నయా హిట్లర్ మోదీ నుంచి రక్షించాలని అన్నారు. గత 30 ఏళ్ల క్రితం మాదిగల ఆత్మ గౌరవం, దామాషా ప్రకారం ఎస్సీల వర్గీకరణ, సమాన వాటాకై ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మంద కృష్ణమాదిగ, ఉద్యమం తన ఒక్కడి గుత్తసొత్తుగా భావించి ఏకపక్ష నియంతృత్వ పోకడలతో రాజకీయ పార్టీల పల్లకి మోసే బోయిలుగా ఉద్యమాన్ని బలహీన పరిచారన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైనదే కానీ సమస్య పరిష్కారానికి జాతి ఆగర్భ శత్రువు అయిన మనువాద మతోన్మాద బీజేపీని ఆశ్రయించడం సరైంది కాదన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, మే 11 : మండలంలోని గురిజాల గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గోలి రవీందర్ రూ.15వేల విలువచేసే 6క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి, రవీందర్ ఇంట్లో నిల్వ చేసిన 12బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మోదీ చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపిస్తాయి

బడుగుల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు

పార్టీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌విరెమణి



మానుకోట ర్యాలీలో మాట్లాడుతున్న జగదీష్‌విరెమణి, పక్కన సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, మే 11 : కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపి స్తాయని పార్టీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌విరెమణి ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆ పార్టీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపు కోరుతూ శనివారం మానుకోట పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పదేళ్ల పాలనలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అనేక పథకా లను ప్రవేశపెట్టారని కొనియాడారు. బీజేపీ పార్టీకి 400 సీట్లు వస్తాయని, అందులో మహబూబాబాద్ పార్లమెంటరీ సీటు కూడా ఉంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలిస్తే మంత్రి అవుతారా! అని.. వారు ప్రతిపక్షంలోనే కూర్చుంటారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలిస్తే కేంద్రమంత్రి అవుతారని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికా రంలోకి వస్తుందని, ప్రధాని మోదీ ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోసంగి మురళి, నాయిని ధర్మారెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, శశి వర్ధన్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, పల్లె సందీప్, చుక్కల నరేష్, ప్రేమ్‌రాయుడు, బాలునాయక్, వెన్నమల్ల సందీప్, ఓర్సు పద్మావతి, ఇందుభారతి, రేష్మా, రమే ష్‌నాయక్ పాల్గొన్నారు.

దేశభద్రత, భవిష్యత్ కోసం గెలిపించాలి

మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే దేశభద్రత, భవిష్యత్ బాగుటుందని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ అభ్యర్థి అజ్మీరా సీతా రాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ మోదీ ప్రధాన మంత్రి అయితేనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని కాంగ్రెస్ ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్ల పాలనలో ఏ ఒక్కనాడు కూడ రిజర్వే షన్ల గురించి మోదీ ఎక్కడ మాట్లాడలేదని చెప్పారు. తాను ఎంపీగా గెలిస్తే మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఫుడ్‌ప్రాసెస్ యూనిట్, మల్యాల కేవీకేలో అగ్రికల్చర్ వ్యవసాయ కళాశాల, జవహర్‌లాల్ నవోదయ స్కూల్, బయ్యారం పెద్ద చెరువును రిజర్వాయిర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌పోర్టు, మణుగూరులో కేంద్రీయ విశ్వవిద్యాలయం, దక్షిణ భారతదేశంలోనే రెండో అ యోధ్యగా పేరుగాంచిన భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేమార్గం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. తమకు టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని, ప్రజలు తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు

చెన్నారావుపేట, మే 11 : కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ పథ కాలు అందుతాయ ని ఎమ్మెల్యే మాధవ రెడ్డి అన్నారు. శనివారం సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణలో పాటు పలువురు, అక్కల్‌చెడకు చెందిన భూక్య రాజేందర్‌తో పాటు 4 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కా ర్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బోడ శ్రీకాంత్, మజ్జిక రాంబాబు, మట్ట భిక్షపతి, కోటేశ్వర్, వీరన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

వర్ధన్నపేట రూరల్, మే 11 : పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు ధీరజ్ సింఘా సూచించారు. శనివా రం మండలంలోని దమ్మన్న పేటలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటును తప్పనిసరిగా వినియోగించుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ప్రలోభాలకు లోనుకాకుండా మంచి నాయకుడిని ఎన్నుకునే బాధ్యత ప్రజలపై ఉందని, దానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసుల సమన్వయంతో గ్రామాల్లో మంచి వాతావరణం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఆర్ఐ కృష్ణస్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న చేను, కుప్పలు దగ్ధం

నల్లబెల్లి, మే 11 : మండలంలోని గోవిందాపూర్ శివారులో ప్రమాదవశాత్తు 20 ఎకరాల మొక్కజొన్న చేను, కుప్పలు దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గోవిందాపూర్ రైతులు కల్తి ప్రభాకర్, ఈక లింగయ్య, కల్తి మాణిక్యం మాట్లాడుతూ.. గోవిందాపూర్ శివారులో రంగాయ చెరువును ఆనుకొని ఉన్న వ్యవసాయ భూముల్లో రైతులం సుమారుగా 20 నుంచి 25 ఎకరాల మేరకు మొక్క జొన్న పంటను వేశామన్నారు. మొక్కజొన్న కంకులను విరిసి, చేనులోనే కుప్పలుగా పోశామన్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మొక్కజొన్న చేను వద్దే పని చేసుకుంటూ ఉన్నామన్నారు. ఎండ తీవ్రత బాగా పెరగడంతో మధ్యా హ్నాం ఎవరింటికి వారు వెళ్లామన్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల సమయం లో రైతులం మొక్కజొన్న చేను, కుప్పల వద్దకు వచ్చేసరికి మొత్తం ఒక్కసారిగా దగ్ధమై ఉందన్నారు. దీంతో ఏమి జరిగిందో అర్థం కాక, కొద్ది సేపు ఆవేదనకు గురయ్యామన్నారు. అనంతరం మొక్కజొన్న చేనునంతా పరిశీలించి ప్రమాదవశాత్తు జరిగిందన్నారు. కాగా, మొత్తం 20 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైందన్నారు. ఈ పంట నష్టం రూ.5లక్షల మేరకు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతులంతా వేడుకుంటున్నామన్నారు. మొక్కజొన్న పంట దగ్ధమై నష్టపోయిన రైతులు కల్తి నారాయణ, ఆగబోయిన రమేష్, ఆగబోయిన రాజు, కుంజ పగడయ్య, కుంజ నాగభూషణం, గట్టి గణపతి, కుంజ భిక్షపతి, కుంజ స్వామి, కుంజ మహేష్ తదితరులు ఉన్నారు.


రాజ్యాంగం మార్పునకు బీజేపీ కుట్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, మే 11 : దేశంలో మూడోసారి బీజేపీ అధికా రంలోకి వస్తే రాజ్యాంగం మార్చేందు కు కుట్ర పన్ను తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగ రాజు, వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు ఆరోపిం చారు. శనివారం పట్టణంలో నిర్వ హించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తిగా డాక్టర్ కడియం కావ్య వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తోందని, 40ఏళ్లలో ఏ దళిత మహిళకు పార్టీలు టికెటు ఇవ్వలేదని కానీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ ఇన్ని సంవత్సరాలు పట్టించుకోని మోదీ, ఎన్నికల ముందు మందకృష్ణ మాదిగను అక్కున చేర్చుకుని దళితుల ఓట్లు దండుకునే కుటిల ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్య క్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ అంగోతు అరుణ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం



రాయపర్తిలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, మే 11 : పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. పార్లమెంటు ఎన్నికల ఓట్ల కోసం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మళ్లీ నియోజకవర్గంలో తిరుగుతూ ఓట్లు అడుగుతున్నాడని, బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి వృథా చేసుకోవద్దని సూచించారు. ఎన్ని కుట్రలు చేసినా కడియం కావ్య గెలుపును ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, మహిళా అధ్యక్షురాలు మునిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మాదిగలకు న్యాయం

వర్ధన్నపేట రూరల్, మే 11 : దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల క్లైమెంట్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు, మాదిగ ఉపకులాలకు రాష్ట్రంలో, దేశంలో న్యాయం జర గాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకిరావాలని సూచించారు. వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

త్రిముఖ పోరు.. గెలిచేదెవరు?

(7వ పేజీ తరువాయి)

పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాజస్థాన్ సీఎం భన్వర్‌లాల్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఇక ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కులం, మతంపైనే, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కబ్జాలపైన ప్రచారం జరిగింది. బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు అంటూ కాంగ్రెస్ ప్రచారం చేయగా, కాంగ్రెస్ హయంలో రాజ్యంగాన్ని సవరించారని, ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని బీజేపీ కౌంటర్ ప్రచారం చేసింది. అలాగే సీఎం రేవం త్‌రెడ్డి మూడు పర్యాయాలు వరంగల్ లోక్‌సభ పరిధి లోని మడికొండ, రేగొండ, హనుమకొండ చౌరస్తా, పోచ మ్మమైదాన్ సెంటర్‌లో సీఎం ప్రచారం చేశారు. 'తెలం గాణకు బీజేపీ ఏం చేసింది.. గాడిద గుడ్డు' అంటూ గాడి ద గుడ్డు నమూనాలతో ప్రచారం నిర్వహించారు. మొత్తా నికి రెండు వారాలుగా రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల ప్రచారంతో ఓరుగల్లు హోరెత్తింది.

పార్టీలకు సవాల్‌గా వరంగల్ సీటు...

అన్ని రాజకీయ పార్టీలకు వరంగల్ లోక్‌సభభ సీటు ప్రతిష్టాత్మకంగా మారింది. 2009లో నియోజకవర్గాల పు నర్విభజనతో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వరంగల్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. 2009లో తొలిసారిగా జరి గిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజ యం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కాం గ్రెస్‌కు విజయం దక్కకుండా పోయింది. ఈ నేపథ్యంలో గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతోపాటు తన కమార్తెనే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నిలిపారు. దీం తో మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే కావడంతో వరంగల్‌లో గెలుపు కాంగ్రెస్‌కు ప్రతి ష్టాత్మకంగా మారింది. అభ్యర్థి విషయంలో తొలుత కాం గ్రెస్‌లో అసమ్మతి ఉన్నప్పటికి క్రమేణ అన్ని మరిచి పోయి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో కాంగ్రెస్‌కు విజయంపై ధీమాతో ఉంది. అలాగే బీజేపీలోనూ విజయంపై ధీమా వ్యక్తమ వుతోంది. 40ఏళ్ల క్రితం 1984లో బీజేపీ అభ్యర్థి చందుప ట్ల జంగారెడ్డి వరంగల్ నుంచి విజయం సాధించారు. చరిత్రను పునరావృతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ పావులు కదుపుతోంది. బలమైన అభ్యర్థిని బరిలో దించి ప్రత్యర్థులకు సవాల్ విసురుతోంది. దీంతో పాటు కాం గ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలహీనతలను క్యాష్ చేసుకుని వరంగల్ సీటులో పాగా వేయాలని అరూరి రమేష్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ సైతం వరంగల్‌లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో గులాబీ దండు పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ప్ర చారం నిర్వహించింది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసం తృప్తి ఉందని, అదే తమ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు గెలు పునిస్తుందని బీఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు.

ఓటరునాడి మారేనా..?

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరా హోరీగా తలపడగా, బీజేపీ కేవలం వరంగల్ తూర్పు లోనే రెండోస్థానంతో సరి పెట్టుకుంది. ఆరు ఎమ్మెల్యే స్థానాల్లో కాంగ్రెస్ గెలవగా.. బీఆర్ఎస్ ఒక చోట విజ యం సాధించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ ఓటమితో కీలకమైన నేతలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరు కూడా బీఆర్ ఎస్ నుంచి వలస వచ్చి పోటీ చేస్తు న్న నేతలే. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీల ఎజెండా మారుతోంది. అసెంబ్లీ ఎన్నిక లతో పోల్చితే బీజేపీ గణనీయంగా బలపడినట్టు ఆ పార్టీ నేతలు అం చనా వేస్తున్నారు. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో గట్టి పోటీ ఇచ్చే స్థాయికి బీజేపీ ఎదగటం చర్చనీయాంశంగా మారింది. పట్టణ ప్రాంత ఓటర్లపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. దీనికి తోడు ఎంఆర్ పీఎస్ నుంచి కూడా పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో కాం గ్రెస్ అభివృద్ధి నినాదం, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఫెయిల్ అంటూ బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయ త్నం చేసింది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో ముఖా ముఖి పోటీ ఉంటే, పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ మారిందనే చర్చ జరుగుతోంది. ఓటరు నాడి కూడా జాతీయ రాజకీయాలు, జాతీయ అంశాలకే ప్రాధాన్యమి స్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో వరంగల్‌లో త్రిముఖ పోరులో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది.

ప్రలోభాలు షురూ..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నక్సల్స్ ప్రాబల్య ప్రాం తమైన భూపాలపల్లిలో సాయంత్రం 4గంటలకే ప్రచా రం ముగియగా, మిగతా ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సాయంత్రం 6గంటల వరకు ప్రచారం నిర్వహిం చారు. చివరి రోజు అభ్యర్థులతో పాటు పార్టీలో కీలక నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ, మండల కేంద్రా ల్లో విస్తృతగా ప్రచారం చేశారు. ఎక్కువగా బైక్ ర్యాలీలలో అభ్యర్థులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రచారం ముగిసిన వెంటనే ఓటరు ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తాయిలాల పంపిణీ అన్ని పార్టీలు షురువు చేశాయి. రెండు ప్రధాన పార్టీలు ఓటుకు రూ.200ల చొప్పున పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంది. మరో పార్టీ కూడా దాదాపు ఇంతే ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మూడోపార్టీ కూడా డబ్బులు పంపిణీపై మల్లాగుల్లాలు పడుతుండగా.. అధిష్ఠానం ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల్లో సుమారు రూ.150కోట్లకు పైగా తాయిలాలు ఓటర్లకు చేరే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎంత నిఘా పెట్టిన పంపిణీ మాత్రం ఆగడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలు..

పురుషులు: 8,95,421, మహిళలు: 9,28,648, ఇతరులు: 397 , మొత్తం ఓటర్లు: 18,24,466

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్‌స్టేషన్
స్టేషన్‌ఘనపూర్	1,25,210	1,28,898	02	295
పాలకుర్తి	1,26,411	1,29,090	13	296
పరకాల	1,08,076	1,14,305	02	239
వరంగల్ పశ్చిమ	1,39,322	1,44,108	16	244
వరంగల్ తూర్పు	1,25,638	1,32,518	339	230
వర్ధన్నపేట	1,34,257	1,39,491	18	279
భూపాలపల్లి	1,36,507	1,40,238	07	317
మొత్తం	8,95,421	9,28,648	397	1,900

2009 నుంచి 2023 అసెంబీ ఎన్నికల్లో పోలైన ఓట్లు

లోక్‌సభస్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016(ఉపఎన్నిక)	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353